క్లుప్తంగా

దోమల నివారణతో డెంగీ దూరం



డెంగీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వెంకట్రావు

కొడవలూరు: దోమల నివారణతో డెంగీ వ్యాధిని దూరం చేయవచ్చని కొడవలూరు పీహెచ్‌సీ హెచ్‌ఏ వెంకట్రావు తెలిపారు. మండలంలోని రెడ్డిపాళెం ఉన్నత పాఠశాలలో డెంగీ వ్యాధిపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడిస్ అనే పగటి దోమ కుట్టడం ద్వారా డెంగీ వ్యాధి సోకుతుందన్నారు. మంచినీరు నాలుగైదు రోజులకు పైన నిల్వ ఉంటే ఈ దోమ ఉత్పత్తి అవుతుందన్నారు. పాఠశాల, ఇళ్ల పరిసరాల్లోని తొట్టెలు, వాడి పారేసిన టైర్లలో నీరు, లేక వర్షపునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. డెంగీ బారిన పడకుండా ఉండాలంటే దోమలు కుట్టకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుష్మ, ఏఎన్‌ఎం నదియ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కూరగాయల తోట పరిశీలన



తోటలో పంటల సాగును తెలుసుకుంటున్న విద్యార్థులు

ముత్తుకూరు: శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సమీపంలోని కూరగాయల తోటను శుక్రవారం సందర్శించారు. రైతులు పండిస్తున్న కూరగాయలు, కూలీల పనులను పరిశీలించారు. తోటకూర, బీర, పొట్ల కాయల సాగు, వాటి విత్తనాలు, వినియోగించే ఎరువులు, పురుగుమందుల వివరాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. స్ప్రింక్లర్ల ద్వారా సరఫరా అయ్యే సాగు నీటిని ఆసక్తిగా తిలకించారు. కూరగాయల సాగు వల్ల వచ్చే ఆదాయం, కష్టనష్టాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిజ, మాధవి, సుమతి, రేఖారాణి, రాజేశ్వరి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



రోగికి వైద్యం అందించే తీరును తెలుసుకుంటున్న డీసీహెచ్ఎస్ రమేష్‌బాబు

కోవూరు: ప్రభుత్వ వైద్యశాలలకు వస్తున్న రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీసీహెచ్ఎస్ రమేష్ సూచించారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఉన్న రోగులతో మాట్లాడి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యంపై ప్రతి ఒక్కరికీ నమ్మకం కలిగేలా డాక్టర్లు పనిచేయాలని, రోగికి అందించే వైద్య సేవల్లో అలసత్వం వహించకూడదని తెలిపారు. గుండెపోటు వచ్చే రోగులకు అత్యవసర సమయంలో వేసే ఇంజెక్షన్ ఉచితంగా వేస్తున్నామని, ఈ ఇంజెక్షన్ అందుబాటులో ఉన్న విషయాన్ని ప్రజలు గమనించాలని తెలిపారు. ముఖ్యంగా గుండెపోటు వచ్చే రోగులకు అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట సూపరింటెండెంట్ వెంకటచలపతిగౌడ్, వైద్యారోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి



రైతులకు సూచనలిస్తున్న ఏఓ వాసు

పొదలకూరు: రైతులు పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏఓ ఎ.వాసు సూచించారు. పొదలకూరు మండలంలోని తాటిపర్తి గ్రామంలో శుక్రవారం ఏఓ రైతులతో కలిసి వరిపంటను పరిశీలించి వరిపైరుకు ఆశించిన మైట్, దోమపోటును గుర్తించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మైట్ నివారణకు ఒబెరాన్ 0.5 ఎంఎల్ లీటరు(100 ఎంఎల్ ఎకరాకు)నీటికి, దోమపోటు(బీపీహెచ్)కు ఫెక్సలాన్ 0.5 ఎంఎల్ లీటరు(94ఎంఎల్ ఎకరాకు) నీటిలో కలిపి పంటపై పిచికారీ చేస్తే మైట్, దోమపోటును నివారించవచ్చని తెలిపారు. అనంతరం ఖరీఫ్‌లో వరిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఆయన వెంట ఏఈఓ ఏడుకొండలు ఉన్నారు.

విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలి



సమావేశాన్ని నిర్వహిస్తున్న ఆదిశేషయ్య

• ఎస్పీడీసీఎల్ సీజీఎం ఆదిశేషయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో విద్యుత్ చౌర్యాన్ని పూర్తిగా అరికట్టాలని ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఆదిశేషయ్య ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో గల స్కాడా కార్యాలయంలో విజిలెన్స్ ఎస్‌ఈ శ్రీనివాసబాబుతో కలిసి డీపీఈ, విజిలెన్స్ విభాగాధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులు సహకరించి చౌర్యానికి పాల్పడకుండా ఉండాలని కోరారు. జిల్లా విద్యుత్ విజిలెన్స్ విభాగాధికారులు, సిబ్బంది ఆకస్మిక దాడులను నిర్వహించాలని, అవసరమైతే ఏపీటీఎస్ విభాగ సహకారాన్ని పొందాలని సూచించారు. నూతనంగా విద్యుత్ సర్వీసులను విడుదల చేసే సమయంలో కేటగిరీలను కచ్చితంగా చూడాలని చెప్పారు. ఒక ఇంటికి ఒక సర్వీస్‌నే ఇవ్వాలని, రెండు సర్వీసులుంటే వాటిని గుర్తించి చర్యలు చేపట్టాలని కోరారు. ఆక్వా సర్వీసులున్న ప్రాంతాల్లో రాత్రి వేళ విస్తృతంగా దాడులు చేపట్టాలని ఆదేశించారు. ఈఈలు జగదీష్, సుధాకర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీనివాసులు, వెంకట్రామిరెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వోద్యోగులపై దాడి నేరం

ప్రభుత్వోద్యోగులపై దాడి చేయడం నేరమని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సిబ్బందిపై ఎవరైనా దాడి చేస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

సమయపాలనను తప్పక పాటించాలి



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న సూర్యతేజ

• కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య కార్మికులు సమయపాలనను పాటించేలా పర్యవేక్షించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నగరంలోని తడికలబజార్, తోటబడి, పత్తివారి వీధి, స్టోన్‌హౌస్‌పేట, కాంతమ్మ ఆశ్రమం, ఏసీనగర్ తదితర ప్రాంతాల్లో గల మస్టర్ పాయింట్లను శుక్రవారం తెల్లవారుజామున తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మస్టర్ పాయింట్లలో సిబ్బంది క్రమం తప్పకుండా హాజరు వేయించుకోవడంతో పాటు రక్షణ ఉపకరణాలను తప్పక వినియోగించాలని సూచించారు. అనంతరం తోటబడి, పప్పులవీధి వాటర్ ట్యాంకుల్లోని పంపింగ్ స్టేషన్లను పరిశీలించారు. నీటి నాణ్యత పరీక్షలను ప్రత్యక్షంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశించిన సమయానికే తాగునీటిని రోజూ సరఫరా చేయాలని ఆదేశించారు.

పార్కులో పరిశీలన

చిల్డ్రన్స్ పార్కులో నిరుపయోగంగా, శిథిలావస్థలో ఉన్న ఫౌంటెయిన్లను కమిషనర్ పరిశీలించారు. గతంలో వినియోగిస్తున్న మ్యూజికల్ ఫౌంటెయిన్ పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ క్రీడా వస్తువులు, వ్యాయామ పరికరాలను పరిశీలించి వాటి పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పార్కు నేమ్ బోర్డు విద్యుత్ వెలుగులతో ఉండేలా నూతనంగా రూపొందించాలని సూచించారు. పార్కులోని పిచ్చి మొక్కలు, వ్యర్థాలను పూర్తిగా తొలగించి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు.

ఎక్కువ కాంతినిచ్చే దీపాలను అమర్చాలి

నగరంలోని వివిధ ప్రాంతాల్లో కమిషనర్ గురువారం రాత్రి పర్యటించారు. కొన్ని కూడళ్లలో తక్కువ వెలుగు ఇచ్చే దీపాలు ఉండటాన్ని గమనించిన ఆయన అత్యంత కాంతినిచ్చే వాటిని అమర్చాలని ఆదేశించారు. ఎంహెచ్‌ఓ చైతన్య, ఈఈ సంజయ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై చైతన్యం పెంచాలి

• డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): ఆరోగ్యంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సూచించారు. నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన ఆరోగ్యం.. మన చేతుల్లో ఉందనే విషయాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా, డయేరియా ప్రబలకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. అనంతరం ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ మాట్లాడారు. వయోజనులకు వేస్తున్న బీసీజీ వ్యాక్సిన్‌ను నూరు శాతం పూర్తి చేయాలని కోరారు. కుష్టు వ్యాధి సర్వేను పక్కాగా నిర్వహించాలని సూచించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, ఎన్సీడీ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ సుధీర్‌కుమార్, డీపీఎం రమేష్, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, డాక్టర్ వాసవీ, ఏఆర్ కిడ్నీ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ నిశ్చలప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రియంవద, డీఎస్‌ఓ భాస్కర్, డెమో అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో అధికారి కనకరత్నం, డీపీఓ రమేష్ పాల్గొన్నారు.

ఈఎన్‌టీ పరికరం వితరణ



నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గల ఈఎన్‌టీ విభాగానికి రూ.3.5 లక్షల విలువైన మైక్రోడెబ్రిడర్ పరికరాన్ని ఆస్పత్రి డాక్టర్ సుకుమార్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ సిద్ధానాయక్ మాట్లాడారు. ముక్కు లోపల పెరిగిన కండ, ఎముకలు లాంటి వాటిని ఈ పరికరాన్ని ఉపయోగించి శస్త్రచికిత్స ద్వారా తొలగించొచ్చని చెప్పారు. ముక్కుకు సంబంధించిన ఆపరేషన్లు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.50 వేల నుంచి రూ.70 వేలవుతోందని వివరించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా చేస్తున్న శస్త్రచికిత్సలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్థోపెడిక్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన



నెల్లూరు (టౌన్): రామలింగాపురంలోని నారాయణ స్కూల్లో విద్యార్థులకు ఎన్నికలను రాయ్ సోషల్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడారు. పాఠశాల దశ నుంచే ఎన్నికలు, నాయకత్వ లక్షణాలను వివరించాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏజీఎం రమణారెడ్డి, డీన్ నరేంద్ర, ప్రిన్సిపల్స్ వెంగళరావు, సోనీ, ఏఓ శివరంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతి బాధాకరం

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని కేఎన్నార్ పాఠశాలలో గోడ కూలి విద్యార్థి గురుమహేంద్ర మృతి చెందడం బాధాకరమని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

నెల్లూరు (టౌన్): కేఎన్నార్ స్కూల్లో గోడ కూలి విద్యార్థి మృతి చెందిన ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరహరి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అదే విధంగా విద్యార్థుల పాలిట శాపంగా మారిన జీఓ నంబర్ 77ను వెంటనే రద్దు చేయాలని కోరారు.

కార్గిల్ విజయోత్సవ ర్యాలీ



నెల్లూరు సిటీ: కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని నగరంలోని వైఎంసీఏ గ్రౌండ్స్ నుంచి గాంధీబొమ్మ వరకు విజయోత్సవ ర్యాలీని బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గుత్తా అశోక్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షుడు మాచిరాజు వెంకటేష్, మదన్ సాయిరెడ్డి, సాయికృష్ణయాదవ్, జిల్లా కార్యదర్శి తిరుపతినాయుడు, కృష్ణసాయినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరెస్సార్‌కు కొండ్రెడ్డి పరామర్శ



నెల్లూరు సిటీ: నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 20వ డివిజన్ ఇన్‌చార్జి రావు శ్రీనివాస రావు (ఆరెస్సార్)ను విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి శుక్రవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని కాంక్షించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఏసునాయుడు, పాశం శ్రీనివాసులు, పార్టీ నేతలు గునపాటి రమేష్‌రెడ్డి, సూరిబాబు, అలీ, అమర్, లక్ష్మీనారాయణ, స్వర్ణా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

'కేఎన్నార్' ఘటనపై కేసు నమోదు

నెల్లూరు సిటీ: నగరంలోని కేఎన్నార్ స్కూల్లో గోడ కూలి విద్యార్థి గురుమహేంద్ర మృతి చెందిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ నారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ ఆధార్‌ను విధిగా పొందాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్

కొడవలూరు: ప్రతి ఒక్కరూ ఆధార్‌ను విధిగా పొందాలని ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్ సూచించారు. మండలంలోని యల్లాయపాళెం-2 సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇప్పటికీ కొందరు గిరిజనులకు ఆధార్ లేకపోవడం ఎంపీడీఓ దృష్టికి వచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధార్ లేకపోవడం వల్ల కనీసం రేషన్ కూడా పొందలేరని తెలిపారు. ప్రభుత్వ రాయితీలు పొందాలంటే ప్రతి ఒక్కరూ విధిగా ఆధార్‌ను తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి వగ్గు శీనయ్య, డిజిటల్ సహాయకుడు రాజేష్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

గోరింటాకు అలంకారంలో కన్యకాపరమేశ్వరి



శోభిల్లుతున్న ఆలయం



విశేషాలంకారంలో అమ్మవారు

నెల్లూరు(బృందావనం): ఆషాఢ మాస శుక్రవారాన్ని పురస్కరించుకొని స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని 250 కిలోల గోరింటాకుతో అలంకరించారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. అమ్మణ్ణిని దేవస్థాన పాలకమండలి గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ దంపతులు దర్శించుకున్నారు.

సైనికుల దేశభక్తిని స్ఫూర్తిగా తీసుకోవాలి



మొక్క నాటుతున్న అధికారులు, విద్యార్థులు

నెల్లూరు (టౌన్): సైనికుల దేశభక్తి, త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచారాధికారి నాగసాయిసూరి పేర్కొన్నారు. కార్గిల్ విజయ దివస్ రజతోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని తాతయ్య బడిలో కార్యక్రమాన్ని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అనంతరం అమరవీరులకు నివాళిగా అమ్మ పేరిట ఒక మొక్కను స్కూల్ ఆవరణలో నాటారు. విద్యార్థులకు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులుగా పుస్తకాలను అందజేశారు.

• కోటమిట్టలోని ప్రాథమిక పాఠశాలలో అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమాన్ని సామాజిక వన విభాగం, శుభమస్తు షాపింగ్‌మాల్, వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



నెల్లూరు (టౌన్): డెంగీ మాసోత్సవాలు, ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా బీవీనగర్‌లోని కేఎన్నార్ స్కూల్లో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులు, వాటి నివారణపై జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ అవగాహన కల్పించారు. సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు, శ్యామ్‌సన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువులో ప్రోత్సాహం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): విద్యలో చక్కగా రాణిస్తూ.. ఆర్థికంగా వెనుకబడిన ఇద్దరు విద్యార్థినులను వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి దత్తత తీసుకున్నారు. నగరంలోని సుంకు చెంగన్న మున్సిపల్ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వారు ఎంత వరకు చదివితే అంత వరకు తాను అండగా ఉంటానని చెప్పారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ సుబ్బరాజు, కార్యదర్శి రమేష్‌బాబు, కోశాధికారి జయదేవ్, మేకల నరేంద్రరెడ్డి, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, వైస్ ప్రెసిడెంట్లు చింతల అమరేంద్రరెడ్డి, పొన్నం రవిచంద్ర, ప్రధానోపాధ్యాయులు అరవింద్, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆ వ్యాఖ్యలు సరికావు



మాట్లాడుతున్న బీజేపీ నేతలు

నెల్లూరు సిటీ: టిప్పు సుల్తాన్ స్వాతంత్ర్య సమర యోధుడని సీపీఎం నేతలు వ్యాఖ్యానించడం సబబు కాదని బీజేపీ నేత పైడి ఆదినారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నరాల సుబ్బారెడ్డి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సృజన తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న యూటీఎఫ్ నేతలు

నెల్లూరు(దర్గామిట్ట): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శేషులు, చలపతిశర్మ మాట్లాడారు. జీఓ నంబర్ 117ను రద్దు చేసి.. జీఓ 55 మేరకు ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. కోవిడ్ సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మురళీధర్‌రావు, జిల్లా కార్యదర్శి సురేంద్రబాబు, నాగిరెడ్డి, ఖాజావలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ, జిల్లా కమిటీ సభ్యుడు జమీర్ అహ్మద్, సాంస్కృతిక విభాగ జిల్లా కన్వీనర్ పార్వతీశం, నెల్లూరు రూరల్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, వెంకటాచలం మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులను చేపట్టనున్న తరుణంలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డైకస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా కొండదిబ్బ, అలంకార్ సెంటర్, బ్రాహ్మణవీధి, రాజాగారివీధి, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

• బృందావనం ఫీడర్‌లో నూతన కండక్టర్లను ఏర్పాటు చేయనున్న తరుణంలో పొగతోట, బృందావనం తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

• హరనాథపురం సబ్‌స్టేషన్ పరిధిలోని ఆదిత్యనగర్ ఫీడర్‌లో తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న తరుణంలో ఆదిత్యనగర్, అయోధ్యనగర్, వెలగచెట్టుసంఘం తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదన్నారు.

• బీవీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సప్తగిరికాలనీ, కావేరినగర్ ఫీడర్లలో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న తరుణంలో పడారుపల్లి, దండోరాకాలనీ, సుప్తగిరికాలనీ, సప్తగిరి లేఅవుట్, బీవీనగర్, అన్నమయ్య సర్కిల్, ఉమ్మారెడ్డిగుంట తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని వివరించారు.

• రంగనాథ సబ్‌స్టేషన్ పరిధిలోని గోపురంవీధి, రంగనాయకులపేట, బుజ్జమ్మరేవు, ఉప్పరపాళెం, ఇసుకడొంక, గురుతోట, కపాడిపాళెం, సంతపేట తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.